క్లుప్తంగా

ఘనంగా సాయి ధ్యానమందిరం వార్షికోత్సవం



పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): పూర్ణానందంపేటలోని శ్రీ షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరం 12వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు షిర్డీ సాయినాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్.. సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్యాన మందిరం కమిటీ అధ్యక్షుడు బలరామ్, సభ్యులు ఆసిఫ్‌కు శాలువా కప్పి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, నాయకులు తంగెళ్ల రాము, శ్రీనివాసరావు, సంగీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్ (ఎస్ఏపీ ఎస్‌డీ) కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు వంగర సురేష్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 22 ఏళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమ గోదావరి జిల్లాల్లో డిగ్రీ చదివిన విద్యార్థులకు విజయవాడలోని సంస్థ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. 14 వారాల కాలపరిమితి గల శిక్షణలో శని, ఆదివారాల్లో మూడు గంటల పాటు తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 70935 29750 ఫోన్ నంబరులో సంప్రదించాలని సురేష్ కోరారు.

ఎంజీ రోడ్డులో బొంబే జ్యూయలర్స్ షోరూమ్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మా గాంధీ రోడ్డులో బెంజిసర్కిల్ సమీపంలోని సువిశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బొంబే జ్యూయలర్స్ షోరూమ్‌ను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. షోరూమ్‌లో పలు డిజైన్లలో గోల్డ్, డైమండ్, ప్లాటినం బంగారు ఆభరణాలు అందించనున్నట్లు నిర్వాహకులు ముఖేష్‌కుమార్ జైన్, మనీష్‌కుమార్ జైన్ తెలిపారు.

పరాశక్తి లీలలు.. అనంతం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పరాశక్తి అయిన అమ్మవారి లీలలు అనంతమైనవని హరికథ కథనంలో గుంటూరుకు చెందిన డాక్టర్ సింహచల శాస్త్రి వర్ణించారు. వసంత నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గుంటూరుకు చెందిన సింహచల శాస్త్రి బృందం పరాశక్తి లీలలను హరికథగా వివరించారు. అనంతరం ఆలయ ఈవో కె.ఎస్. రామరావు సింహాచల శాస్త్రి బృందానికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): తీవ్రమైన ఎండలకు బాటసారులు వడదెబ్బ బారిన పడకుండా ఉండటానికి పాయకాపురం శాంతినగర్‌లోని శారద స్కూల్లో పెనుమత్స తాతారావు జ్ఞాపకార్థం స్కూల్ కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు సోమవారం మజ్జిగ పంపిణీ చేశారు. బాటసారులు అవసరమైతే తప్ప బయటకు రాకూడదని, వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అప్పలరాజు సూచించారు. సేవాసంఘాలను కలుపుకొని మరికొన్ని మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శారద స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బాటసారులు, ప్రయాణికులకు అందిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం కొనసాగుతోంది. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతల సహకారంతో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సోమవారం దాత సాంబశివనాయుడు సహకారంతో బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. చైర్మన్ బోయిన భాను ప్రదీప్.. దాతలు స్వచ్ఛందంగా ఉచిత మజ్జిగ పంపిణీకి సహకరిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా ఆశీస్సులతో 175 స్థానాల్లో విజయం

వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



50వ డివిజన్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఆసిఫ్

విద్యాధరపురం... వించిపేట(విజయవాడపశ్చిమ): ప్రజాశీస్సులతో 175 స్థానాల్లో విజయం సాధిస్తామని వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' అభ్యర్థి షేక్ ఆసిఫ్ ధీమా వ్యక్తం చేశారు. 50వ డివిజన్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం జరిగింది. డివిజన్‌లో గడప గడపకూ వెళ్లిన ఆసిఫ్ గడచిన ఐదేళ్ల పాలనలో అందుకుంటున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వివరించి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 'పశ్చిమ'లో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. నియోజకవర్గానికి ఇప్పుడు పొలిటికల్ టూరిస్టులు వచ్చారని, ఎన్నికల తర్వాత కనిపించకుండా పోతారన్నారు. ప్రజలు అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. తాము ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగనన్న పాలనలో చేసిన మంచిని వివరించి ఓట్లు అడుగుతున్నామని, ప్రతి గడపలోనూ తమకు విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు.

సీఎంపై దాడి అమానుషం

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి.. భయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడటం సిగ్గు చేటన్నారు. ఓటమి భయంతోనే చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ ఇష్టానుసారంగా మాట్లాడుతూ తమ పార్టీ కార్యకర్తలను రెచ్చగొడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు మచ్చ తెచ్చేలా భౌతికదాడులకు పురిగొల్పుతున్నారని మండిపడ్డారు. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబుకు చెప్పుకోవడానికి తాను చేసిన ఒక్క మంచి పని కూడా లేకపోవడంతో ప్రజలను రెచ్చగొట్టి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. లోకేశ్ కూడా రెడ్ బుక్ పేరుతో పిచ్చికూతలు కూస్తూ ఎవరు ఎక్కువ కేసుల్లో ఉంటే వారికి అంతమంచి నామినేటెడ్ పదవులు ఇస్తానని రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు పవన్‌కల్యాణ్ స్థాయిని మరిచి ముఖ్యమంత్రిపై అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, వీరి చిల్లర చేష్టలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజలు ఓటుతో వారికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చలపతిరావు, మహాదేవు అప్పాజీ, కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ 50వ డివిజన్ ఇన్‌చార్జ్ బంక విజయ, నాయకులు నంబూరి ప్రదీప్, బంక చాముండేశ్వరి, దుర్గాసి కోటేశ్వరరావు. బడితబోయిన రాము, దుర్గాసి హిమబిందు, విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెలంపల్లికి పరామర్శ



వెలంపల్లిని పరామర్శిస్తున్న పోతిన మహేష్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): సింగ్‌నగర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌పై జరిగిన దాడిలో కంటికి తీవ్ర గాయమైన వెలంపల్లిని సోమవారం పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. బ్రాహ్మణ వీధిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో నగర డిప్యూటీ మేయర్ అవుత శైలజారెడ్డి, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు, కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ, వాసబాబు, తంగెళ్ల రాము తదితరులు ఉన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇటీవల విజయవాడలో జరిగిన జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్రలో గాయపడిన ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ నేత పోతిన మహేష్ పరామర్శించారు. పోతిన మహేష్ సోమవారం వెలంపల్లి శ్రీనివాసరావు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. గాయం వివరాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని పేర్కొన్నారు. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జల్లి రమేష్, బొట్టా సాయికుమార్, నెమలి సంజీవరావు, సుభాసి భాను, సోమి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సీతారాముల కల్యాణం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ఉదయం సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయంత్రం మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ముత్యాలంపాడు పుర వీధుల్లో షిర్డీలో మాదిరిగా చందనోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. భక్తులు సీతారాముల కల్యాణం, చందనోత్సవంలో పాల్గొని సీతారాములు, బాబావారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

కేబీఎన్ విద్యార్థులకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు అద్భుతాలు సృష్టిస్తున్నారని ఆ కాలేజీ కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు అన్నారు. ఇటీవల ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ సీఎస్ఈ గ్రూప్‌నకు సంబంధించి మంగం హర్షిణి (988), దేవనబోయిన భూమిక (988) మార్కులు సాధించి రాష్ట్రంలోనే ముందు భాగాన ఉన్నారని పేర్కొన్నారు.

సీనియర్ ఇంటర్ ఏ అండ్ టీ గ్రూప్‌నకు చెందిన పేపకాయల మేరీ (963), పీతా భానుప్రకాష్‌రెడ్డి (963) మార్కులు సాధించి రాష్ట్రంలో ముందు భాగాన ఉన్నారని చెప్పారు. జూనియర్ ఏ అండ్ టీ గ్రూప్‌నకు సంబంధించి మోకా జాషువా (487), పూతి కుసుమకుమారి (487) మార్కులు సాధించారని రాష్ట్రంలోనే ముందు భాగంలో ఉన్నారని వివరించారు. జూనియర్ ఎంపీసీలో 470 మార్కులకు ఎం. శ్రీవైష్ణవి (465), సీహెచ్ తేజస్వి (465), జూనియర్ బైపీసీలో 440 మార్కులకు స్మితాషా (432), పి.లావణ్య (424) సాధించారని పేర్కొన్నారు. సీనియర్ ఎంపీసీలో వెయ్యి మార్కులకు మనోజ్‌కుమార్ (986), ఎస్.గగణశ్రీ (984), ఏ శ్రావ్యశ్రీ (982) సీనియర్ బైపీసీలో తన్మయి మధుశ్రీ (976), జీ నోబుల్‌గాడ్‌ఫ్రే (974) మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తమ కళాశాల పాటుపడుతోందన్నారు. తొలుత విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్ ఫైన్ డైరెక్టర్ ఎస్.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

నలందలో పెయింటింగ్ కాంపిటీషన్స్



విజేతలతో ప్రిన్సిపాల్ మాదల పద్మజ

లబ్బీపేట(విజయవాడతూర్పు): వరల్డ్ ఆర్ట్ డే పురస్కరించుకుని గాయత్రీనగర్‌లోని నలంద విద్యానికేతన్‌లో సోమవారం ఇంటర్ స్కూల్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్ నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన పెయింటింగ్స్, శిల్పాలు వివిధ ఫొటోలతో కూడిన చిత్ర ప్రదర్శనలను నిర్వహించారు. ఇంటర్ స్కూల్స్ పెయింటింగ్ కాంపిటీషన్స్‌లో నగరంలోని పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను 3వ తరగతి నుంచి 12 వ తరగతి వరకూ మూడు గ్రూపులుగా నిర్వహించారు. గ్రూప్–ఎలో 3 నుంచి 5వ తరగతి వరకూ, గ్రూప్– బిలో 6 నుంచి 8, గ్రూప్–సి 9 నుంచి 12 తరగతి వరకూ విద్యార్థులు పాల్గొన్నారు. గ్రూప్ –ఎలో కనక్ కరీర, ఐ.గీతాశ్రీ, కె.నిషిథ్ విజేతలుగా నిలవగా, బి హిమిత, డి.శ్రీహిత కన్సోలేషన్‌కు ఎంపికయ్యారు. గ్రూప్ బిలో ఎంఎల్ శ్రేష్ఠ, కె.వేద సంహిత, డి.శ్రీదుర్గా నిత్య, బిజలేఖనందినిలు విజేతలుగా నిలవగా, పి.దేవశ్రీ, ఎస్.నిహార్, ఆర్నా బష్నలు కన్సోలేషన్‌లు అందుకున్నారు. గ్రూప్ సి నుంచి కె.శ్రీనిధి, ఎస్ సంహిత, జి.ఈషాపుష్ప, ప్రిది కతారియాలు విజేతలుగా నిలవగా, ఎస్ఎస్ఎస్ వశిష్ట, ఎన్.జశ్వంత్, గ్రీష్మలక్ష్మి కన్సొలేషన్ గెలుపొందారు. విజేతలకు ప్రిన్సిపాల్ మాదల పద్మజ బహుమతులు అందజేశారు.

న్యాయవాదులు వృత్తిని దైవంగా భావించాలి




బార్ అసోసియేషన్ సభ్యులకు అభినందన సత్కారం నిర్వహిస్తున్న నాగేశ్వరరావు తదితరులు

విజయవాడకల్చరల్: న్యాయవాదులు తమ వృత్తిని దైవంగా భావించాలని అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు న్యాయవాది చీదెళ్ల నాగేశ్వరరావు అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు కోటేశ్వరరావు సాహితీసమితి ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద 2024–25 సంవత్సరంలో బెజవాడ బార్ అసోసియేషన్‌కు ఎన్నికైన కమిటీ సభ్యులకు సోమ వారం అభినందన సత్కారం, సినీ సంగీత విభా వరి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముఖ్య అతిథి గా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ బెజవాడ బార్ అసోసియేషన్ ప్రజల కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త చంద్రమౌళి, కార్యదర్శి అరిగల శివప్రసాద్, ఉపాధ్యక్షుడు గండూరి వెంకటరామశర్మ, గ్రంథాలయ కార్యదర్శి చావలి రవికుమార్, మహిళా కార్యదర్శి సిద్దాబత్తిన రాజ్యలక్ష్మిని నిర్వాహకులు ఆత్మీ యంగా సత్కరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు, శ్రీ కళాభారతి వ్యవస్థాపకుడు శింగంశెట్టి చంద్రశేఖర్, విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు, శారదా కళాసమితి వ్యవస్థాపకుడు డోగిపర్తి శంకరరావు, బోడి ఆంజనేయరాజు, ప్రసూనారామన్ పాల్గొన్నారు. నగరానికి చెందిన పలువురు గాయకులు చిత్ర గీతాలను ఆలపించారు.

ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తం



లకిరెడి ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న జేసీ సంపత్‌కుమార్

మైలవరం: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ సంపత్ కుమార్ తెలిపారు. మైలవరం తహసీల్దారు కార్యాలయం, అనంతరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమావేశ హాలులో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పలు బృందాలతో రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్ సార్వత్రిక ఎన్నికలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని, 26న నామినేషన్‌ల పరిశీలన, 27 నుంచి 29 వరకు ఉపసంహరణలకు గడువు ఉంటుందని తెలియజేశారు. నామినేషన్‌లు దాఖలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతలు, సలహాలు, సూచనలను వివరించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తమ విధుల్లో అలసత్వం వహిస్తే ఎన్నికల నియమావళిని అనుసరించి క్రమశిక్షణ చర్య తీసుకుంటామన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ విధిగా పోస్టల్ బ్యాలట్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో మైలవరం ఏసీపీ మురళీమోహన్, తహసీల్దారు టీఆర్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాస్, నియోజకవర్గ ఏఆర్‌ఓలు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పటమట పండరీపురానికి చెందిన నక్కా శేఖర్‌బాబు వెల్డింగ్ పనులు చేస్తాడు. అతను ఆదివారం కానూరులో బాలాజీ సూపర్‌మార్కెట్ వద్ద బందరు రోడ్డు దాటుతున్న సమయంలో పెనమలూరు వైపు నుంచి విజయవాడకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో అత్యవసర చికిత్సకు చేర్చారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

వైఎస్ జగనే మళ్లీ సీఎం

- ప్రజలు బలంగా కోరుకుంటున్నారు
- ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత



భవానీపురంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మహిళతో మాట్లాడుతున్న కేశినేని శ్వేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలు బలంగా కోరుకుంటున్నారని ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. విజయవాడ పార్లమెంటు వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం భవానీపురం 41వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. గాలిబ్ షాహిద్ దర్గా పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగారు. ఆమెకు అడుగడుగునా ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ గడపగడపకూ వెళ్తుంటే ప్రతి ఒక్కరూ మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. 58 నెలల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన చేసిన కృషి, పథకాలే ఆయన్ను మళ్లీ సీఎంగా గెలిపిస్తాయన్నారు. మైనార్టీలకు సమాజంలో ఉన్నత స్థానం కల్పించింది వైఎస్ జగనేనని గుర్తు చేశారు. ఎంపీ కేశినేని నాని భవానీపురం హజ్రత్ గాలిబ్ షాహిద్ దర్గా విషయంలో మైనారిటీల పక్షాన నిలబడ్డారన్నారు. విజయవాడ ప్రాంత పెద్ద కొడుకుగా కేశినేని భవన్ ద్వారా అందుబాటులో ఉంటూ పదేళ్లలో ఎనిమిది వేల కోట్లతో నగర రూపురేఖలు మార్చారన్నారు. కార్పొరేటర్‌గా, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రజా సేవలో ఉంటూ మచ్చలేని నాయకుడు ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పేరు తెచ్చుకున్నారన్నారు. మళ్లీ ఎంపీగా కేశినేని నానిని, ఎమ్మెల్యేగా షేక్ ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

బ్యాంకులకు కన్నాలు వేసినవారు వస్తున్నారు

బ్యాంకులకు కన్నాలు వేసిన వారు టూరిస్టులుగా వస్తున్నారని, అటువంటి వారిని వెస్ట్ ప్రజలు నమ్మొద్దని శ్వేత అన్నారు. కూటమి అభ్యర్థులు ఈడీ కేసుల్లో, స్కాముల్లో నిండా మునిగిపోయి ఉన్నారన్నారు. పశ్చిమ గురించి ఏమీ తెలియని వ్యక్తులు నియోజకవర్గాన్ని సింగపూర్ చేస్తామని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. 12 సంవత్సరాలు రాజ్యసభ సభ్యుడిగా, మూడేళ్లు కేంద్రమంత్రిగా ఉన్న వ్యక్తి ఆయన ఎంపీ లాడ్స్ నుంచి, కేంద్ర మంత్రిగా రాష్ట్రానికి, విజయవాడకు ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. 2019కు ముందు టీడీపీ విజయవాడకు చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే టూరిస్టులను కాదు, ప్రజాసేవలో ఉన్న నాయకుల్ని గెలిపిస్తామని ప్రజలు ఇప్పటికే డిసైడ్ అయ్యారన్నారు. సుజనా చౌదరి ఏ విధంగా అభివృద్ధి చేయాలో కూడా తెలియకుండా హామీలు ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పశ్చిమంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు తాను సిద్ధమన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నాన్ని ఖండించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, యరెడ్ల ఆంజనేయరెడ్డి పడిగిపాటి చైతన్య రెడ్డి, నాయకులు ముస్తాక్ అహ్మద్, ఖాజా, సుభాని ఖాన్, నీలం దేవదానం, యనమద్ది నాగమల్లేశ్వర రావు, షేక్ అమానుల్లా, బ్రహ్మయ్య, రాధా రంగా రీ–ఆర్గనైజేషన్ అధ్యక్షుడు హరికృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వెబినార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 'భవన నిర్మాణంలో అగ్ని రక్షణ పదార్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, అయస్కాంత సెన్సార్‌ల్లో నానో సాంకేతికత'పై అంతర్జాతీయ వెబినార్ జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన వెబినార్‌లో దక్షిణ కొరియా, డొంగువాన్ జాతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ చీదరాల రవికుమార్, గౌహతి ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.పాము, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ కొల్లు ప్రతాప్ ప్రసంగించారు. కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ కళాశాల విద్య కమిషనరేట్ ప్రభుత్వ కళాశాలలో ప్రయోగాలకు ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. అందులో భాగంగా వెబినార్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి నానో సాంకేతికత ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ప్రపంచంలోని సుమారు రెండు వందల మంది అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ఏక రుద్రాభిషేకం, 8 గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం స్వామివార్లకు విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి ప్రత్యేక హారతులు ఇచ్చారు. ఈ నెల 17వ తేదీన శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో ఎం.గంగాధరరావు తెలిపారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, ఉదయం 9.30 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం చేస్తామన్నారు. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

వృత్తి విద్యా కోర్సులతో స్వయం ఉపాధి



మాట్లాడుతున్న విద్యాకన్నా

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు వృత్తి విద్యా కోర్సులు నేర్చుకుని స్వయం ఉపాధి పొందవచ్చని జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ నాగళ్ల విద్యాకన్నా చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లోని జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యాన సోమవారం వేసవిలో మహిళలకు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి కోర్సుల ఉచిత శిక్షణను విద్యాకన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఫ్లవర్ మేకింగ్, మెహంది, డెకరేటివ్ ఆర్టికల్స్, వాషింగ్ మెషిన్ లిక్విడ్స్, డిటర్జెంట్స్ మేకింగ్, ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటమ్, చాక్లెట్స్ మేకింగ్, న్యాచురల్ హెయిర్ ఆయిల్, షాంపు మేకింగ్‌ల్లో శిక్షణ తరగతులు మే 2వ తేదీ వరకు జరుగుతాయన్నారు. వీటిని మహిళలు వినియోగించుకోవాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణలో కోర్సులను నేర్చుకుని స్వయం ఉపాధి పొందడంతో పాటు మరికొందరికి ఉపాధి ఇవ్వవచ్చని చెప్పారు. సంస్థ సిబ్బంది, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



కాలనీవాసులకు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జక్కంపూడి కాలనీలో ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి టి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో కాలనీలోని రద్దీ ప్రాంతాలతో పాటు బస్టాండ్, లంబాడీపేట సాయిరాం థియేటర్ వద్ద అవగాహన కల్పించారు. గ్యాస్ స్టౌ వినియోగంలో ఎదురయ్యే ప్రమాదాలు, కరెంట్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదాలు ఎలా జరుగుతాయి.. ప్రమాదాల్లో ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ఏ విధంగా చర్యలు తీసుకోవాలనే దానిపై సూచనలు, సలహాలు అందించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపిస్తే వాటిని ఎలా నివారించవచ్చో ప్రయోగాత్మకంగా వివరించారు. అపార్టుమెంట్లలో డ్రై కెమికల్ పౌడర్లు, ఫైర్ అలారంలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

దాడి కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కర్రతో దాడికి పాల్పడిన వారిపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లి వేపచెట్టు సెంటర్‌లో కొంత మంది యువకులు బైక్ ర్యాలీ చేశారు. ర్యాలీతో రోడ్డుపై పిల్లలకు ఇబ్బందికరంగా ఉందని విజయ్‌కుమార్ చెప్పాడు. ర్యాలీలో ఉన్న చప్పిడి శివనాగరాజు, కోటేశ్వరరావు, జిల్లాబత్తుల మహేష్, చప్పిడి రవివర్మ, ఆంజనేయులు, చిగురుపల్లి బావి, సుఖభోగి శ్యాంకుమార్ గొడవ పడ్డారు. విజయ్‌కుమార్‌పై మహేష్ కర్రతో దాడి చేయడంతో తలకు గాయమైంది. విజయ్‌కుమార్‌పై దాడి చేసే క్రమంలో కలపర్తి సత్యం, ముగ్గురాళ్ల అవినాష్, తిరుపతమ్మ అనే వారు అడ్డురాగా మహేష్‌తో పాటు మరి కొంతమంది దాడి చేశారు. బాధితుడు పోలీసులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రాజకీయ పార్టీలు నిబంధనలను పాటించాలి

పెనమలూరు: సాధారణ ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నేతలు నియమ నిబంధనలు విధిగా పాటించాలని రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరులో తన కార్యాలయంలో సోమవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం రాజకీయ పార్టీలు నియమావళిని పాటించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను అనుసరించి ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. నామినేషన్ సమయంలో ర్యాలీలు నిర్వహించరాదన్నారు. పెనమలూరులోని తన కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. పెనమలూరు అసెంబ్లీకి సంబంధించి ఈవీఎంలు గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో భద్రపరిచామన్నారు. మే 1న తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ వద్ద రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. మే 2 నుంచి 5వ తేదీ లోపు తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్ వద్ద ఈవీఎంల కమిషన్ చేస్తామని వివరించారు. పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన పోలింగ్ కేంద్రాల ఏజెంట్ల వివరాలు అన్ని రాజకీయ పార్టీలు వెంటనే తమ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల నియమ నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో తహసీల్దార్ ప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.